స్కెచ్

# చిత్ర జాతకం

"విభావరి"

ఆవేళ మూర్తిని క్లబ్‌లో చూడగానే అతనేదో పెద్ద 'మూడ్'లో ఉన్నట్టుగా అర్థమయింది. నేను వచ్చిన జాడ అతనికి తెలియనేలేదు. మెల్లిగావెళ్ళి, ప్రక్కనే ఉన్న పేము కుర్చీలో కూర్చుంటూ, టీపాయ్‌మీది పత్రిక తీసాను. అటువంటి సమయాలలో మూర్తిని కదపడం నా కిష్టం ఉండదు. ఈలోగా మూర్తిని గురించిన 'పీఠిక' కొంత తెలిస్తేనేగాని నా ఆశయం నెరవేరదు కనుక టూకీగా ఆ విషయం చెప్పి వదిలేస్తాను. మూర్తి తండ్రి గొప్ప ఉద్యోగం హోదా వెలిగించినా యిప్పుడు మూర్తి, 'కాగితాలుచదివి కలాలు బరికే' ఒక సజీవయంత్రం. యిచ్చిన ఆస్తీ అప్పులూ అట్టే లేకపోయినా, అమాయకులయిన నల్గురు తమ్ముళ్ళనీ, అమ్మనీ యిచ్చి గతించాడా తండ్రి. అప్పటికి జరిగిపోయిన చెల్లాయిపెళ్ళీ జరుగవలసిన చిన్ని చెల్లాయి పెళ్ళికీ సరిపోయింది. యిక మిగిలిందల్లా మూర్తి తత్వం. మనిషెప్పుడూ శుభ్రంగానే ఉంటాడు. నున్నగా చేయించిన గడ్డమూ వదులు పయిజామా సగంచేతుల చొక్కా స్లిప్పర్లు అతిలోకంలో విహరిస్తున్న వానిలా చూపులూ సాధారణంగా చిరునవ్వూ.

తన ఆలోచనలలోంచి మరలి, చూపులని తిప్పి నావంక చూచాడు మూర్తి.

"యివాళ ఆఫీసునుంచి పెందరాళే వచ్చావను కుంటాను" అన్నాను. "ఆ పర్మిషన్ పెట్టి వచ్చాను. మనస్సు అదోలా ఉంది. స్పష్టమయిన కారణాలేవీ లేవు." యిటువంటి పరిస్థితి మూర్తితో నాకు మామూలే అయినా యీనాడు అతనిలో గంభీరతా ఆందోళనా వ్యక్తమవుతున్నాయి.

"అసలు విషయం ఏమిటోయ్" అన్నాను కుర్చీ దగ్గరికి లాక్కుంటూ.

యిద్దరం కొత్త సిగరెట్లు ముట్టించాము. మూర్తి రెండు అరిచేతులవైపు గీఢగా చూసికొని యిలా ప్రారంభించాడు.

'కథల్లో...జీవితాల్లో...సినిమాల్లో...జీవితాన్ని గురించిన ఎన్నో నిర్వచనాలని విన్నాం...ప్రతీదీ సత్యంగానే తోస్తుంది. ప్రతిదాంట్లోనూ కొన్ని అగాధ బాధాస్మృతులు చెలరేగుతూనేఉంటాయి. కాని నా జీవిత ఫణితి, గమ్యం, ఎందులోనూ చిత్రింపబడలేదని నా నమ్మకం...జీవితంలోఎన్నో దుస్సంఘటనలు ఎదుర్కొని ఆ తాకిడిని ఓర్చుకొని సాగరం యీదుకొని రావడం వేరు...యిది అలా కాదు. మనోహరమయిన తెల్లని నురుగుకింది, జలపాత వేగంలా, ప్రతి చిన్న విషయంలోనూ, చలనంలోనూ, అనుకున్నది తారుమారవుతూ... మొత్తంమీద చూచేవాళ్ళకి, తనకి కూడా ఏమీ ఫరవాలేదనే భ్రమలు కల్పిస్తూ ఎన్నో ప్రమాదకరమయిన కొంటె నాటకాలాడుతోంది నా జీవితం..." యిక్కడ మూర్తి ఆగి సిగరెట్టు ఆఖరిదమ్ము గట్టిగాలాగి, పీకి తొట్లో పారేశాడు.

'అసలు నా సంగతి చిన్నప్పటినుంచీ అలానే వస్తోంది. అందరూ తెలివిగలవాడనేవారు మార్కులాట్టే రాకపోయినా...మంచివాళ్ళని భ్రమించి స్నేహంచేస్తే తర్వాత వారినటక చూస్తే అసహ్యమేసేది...దూరదూరంగా ఉంచేవాళ్ళతో క్రమేణా ప్రాణస్నేహమేర్పడేది...ఎంతో బాగా వ్రాశాననుకున్న యింగ్లీషులో పోవడమూ...అసంతృప్తిగా బరికిన కెమిస్ట్రీలో క్లాసు రావడమూ కంటే విచిత్రం ఏముంటుంది. యీ 'ఎదురు రావడం' చాల దూరం వచ్చేసింది. చివరకి మంచి విషయంలో జరగక పోయినా కీడులో అతికినట్టుగా జరుగుతూ ఉండేవి. పోయిన 'పార్టు తిరిగి కట్టడానికి, అన్నిరకాల ఆర్థికస్తోమతలూ తగ్గగా నిరుద్యోగ జీవితంలో డిగ్రీకాలం పనిచేసి, తిలోదకాలిచ్చేసమయానికి ఊడిపడిందొక ఉద్యోగం అది ఏమిటో తెలుసా...రాదని తెలిసీవచ్చినా చేయడానికి యిష్టంలేకా, ఎంతో అసంతృప్తిగా రాసి, ఏడుపుమొహం పెట్టించిన సర్వీసుకమిషన్ సెలక్షన్.

కొందరికి విషయాల మంచి చెడ్డలు ముందుగానే తెలిసిపోయి, వాటి లోతుపాతులు విచారించి, తూచి, విరగ్గొట్టి మంచివని నమ్మిన వాటిని చేసి, మంచి పొంది గణతి కెక్కుతారు. యికపోతే అనుభవంలోకివస్తే తప్ప ఆ విషయం గుణగణాలివి అని చెప్పలేక (చెప్పినా తన దాకావచ్చేటప్పటికి ఎలా ఉంటాయోనని నమ్మకం చాలక) అనుభవం దాటాక ఏంజరిగినా తలవంచి పోతారు మరొక రకం. యిది నా స్థితి" మూర్తి ధోరణిలో పడి యిక నా ప్రశ్నలుగాని, జవాబులుగాని వినే ధోరణిలో లేడు. నాకూ అతను చెప్పినదాంట్లో తలవూపు తున్న ఒకానొక సత్యరహస్యం గోచరించింది. గుండెనిండా ఊపిరితీసి, బరువుగా వదులుతూ... మూర్తి యిలా ప్రారంభించాడు:

"ఉద్యోగం రాగానే యికయినా వరుసగా పరీక్షలు కట్టిపారేద్దామనుకున్నాను. నాన్నగారి సంపాదన యింట్లోకి ఉండనేవుంది. ఇక తన జీతం తన యిష్టమేగా! కాని విధి చూడు...నా ఊహలు రూపంతీసికోకముందే ఆయన కాలంచేశారు...." మూర్తి బాధగా మూల్గి ఒక నిముషం ఆగాడు. నాకు మూర్తి పరిస్థితులన్నీ తెలుసు. కాని యిప్పుడు వాటన్నిటికీ సూత్రప్రాయంగా ఉండే నిగూఢ రహస్యం బహిరంగమవుతున్నట్టుగా ఉంది. "ఏ జీతంతో నేను ఆశలు తీర్చుకోవాలనుకున్నానో, అది యిప్పట్లో యింటిల్లపాదికీ ఆధారమయి కూర్చుంది. ఎలా... టెంపరరీ సర్వీసు—పించనూ లేదు, యిన్సూరెన్సూ లేవు. ఇక అందరూ ఒకే చోట ఉండాలని, తీరికవేళల్లో ట్యూషన్లు చెప్పుకుంటూ కాలంగడపాలనీ, ఆఫీసులో పని ఎక్కువయినా కూడా ట్యూషన్లు విడువకుండా తంటాలు పడుతుంటే ఈ ట్రాన్స్‌ఫరొకటి. బస్సుప్రయాణం రెండుగంటలే అయినా పొరుగూరుపొరుగూరే కదా! ఏడాది మధ్యలో తమ్ముళ్ళ చదువు మాని పించి తీసికెడతానా!"

అవును. మూర్తికి ట్రాన్స్‌ఫరయింది, రెండు నెలలకిందట. వారానికోసారి వచ్చి వెడుతుంటాడు.

ఎలాగో తంటాలుపడి జీవితం లాగుతుంటే యిక మిగిలింది ఒకటే మంచి. అది రాధ. పాపం వయసు చిన్నదైనా, నేను అసలు నగలు, పట్టు చీరెలమీద మొదలే ఆశలేకపోగా, గ్లాస్కో చీరయినా కొనిపెట్టక, పెట్టలేక, చిన్నజీతంతో పడే ఆవేదనంతా గ్రహించుకొని ఎంతో ధైర్యం చెప్పేది. మనిషి నలుపయినా హృదయం ఎంత స్వచ్ఛం! నాకు ఫలానా కావాలని ఒక్కనాడూ కోరి ఎరుగదు...వీలులేకపోతే ఎక్కడ బాధ పడతానో అని. ఎన్నికష్టాల్లో మనస్సు ముక్కలయినా రాధచేతుల్లో యిరికిపోయి ఆ చిలిపికళ్ళలోకి చూస్తూంటే అన్నీ మటుమాయమయేవి... ఆదివారంకోసం చకోరంలా వేచి ఉండటం...ఆ రాత్రి రాధ వెచ్చని కౌగిలిలో పరవశమవడం... తప్ప యింకేమీ మధురమైంది ఉండేది కాదు."

మూర్తి ఆగాడు...రాధామూర్తుల ప్రణయం నాకు తెలియనిది కాదు. ప్రేమించి పెళ్ళిచేసుకోకపోయినా, పెళ్ళయి ప్రేమికులయినారు. మొన్న మొన్ననే రాధను పుట్టింటికి పంపాడు.

"రాధ జాబులు రాస్తోందా...ఎలాఉంద"ని అడిగాను. మూర్తి మాట్లాడకుండా జేబులోంచి ఒక ఎర్రకాగితం తీసి యిచ్చాడు.

"అకస్మాత్తుగ రాధ చనిపోయింది...బయలు దేరిరావాలి...

మాధవుడు"

నాకు మతిపోయింది. కుర్చీలోంచి లేచి నిలబడ్డాను. "వైరు ఎప్పుడు వచ్చింది...ఎప్పుడు వచ్చింది"అని అరిచాను.

"యిప్పుడే నువ్వు వచ్చేముందే. వెళ్ళడానికి యిక రాత్రి 12 గం॥ దాకా బండిలేదు. లాస్టు బస్సు నాలుగింటితో ఆఖరు. యిలా కూలబడ్డాను" అన్నాడు మూర్తి.

యిద్దరం తిరిగి బజారులో పడ్డాము. లోపల ఎంత సతమతమవుతున్నాడో కాని మూర్తి పైకి ఏమీ అనటంలేదు. నాకు ఏడుపు వచ్చేస్తోంది. అదిగో...అదే...బస్సు...యింజను బాగుచేయించడంలో ఆలస్యంగా బయలుదేరిందిట. వెళ్ళిబస్సులో కూర్చోబెట్టాను మూర్తిని. "యిది నీ ప్రయత్నం కనక యిలా అయిందికాని లేకపోతే యిది నా కందేది గాద"న్నాడు మూర్తి.

నలుపు తిరిగేదాకా అటే చూస్తుండిపోయాను. మూర్తి చెప్పిందంతా విన్నాక నాకు ఏదో ఒక అగాంధంలోంచి కొన్ని విచిత్రసత్యాలు తెల్లమవుతున్నట్టుంది. ★